# కిష్టమ్మగారి పెద్దజీతగాడు

ఈ ఏటి పంటకుప్పలు దొబ్బు దొబ్బున నూర్చెయ్యాలి. అదే కిష్టమ్మగార న్నాడు. మడిసి అన్నాడంటే నూర్చెయ్యాల్సిందే! లేకపోతే ఒసికర్ర దీసుకు తల పగల్నాకుతాడు— అట్టాటి మడిసే కిష్టమ్మగారు. సెయి బహు సురుకు యీ కిష్టమ్మగార్ది. మడిసికి ఏ నిమిసాన గుబులుమల్లుద్దో, ఎప్పుడు యీపు మీన సెయిపడుద్దో తెలవదుగందా! కాత్తె పెద్దజీతగణ్ణిగందా— అప్పు డప్పుడు మడిసిని నమ్మగూడదా అనిపిచ్చుద్ది. పెల్లి జేసుకున్నా— పెల్లాం కాపరాని కొచ్చిందీ— అయినా మడిసిని కనిపెట్టి చూడ్డం యీ కిష్టమ్మ దొంగల్దోలా! అల్లప్పుడు పుటిక్కిన నోరు జారన్నా సుబ్బాంతో "కిష్టమ్మగారు పొలుపు దీసుకుని బాదా"డసి. ఇరగబడి నవ్వింది. నడ్డి యిరగదన్నాల్సిందప్పుడే. ఉత్త కొక్కిరాయిముండ! అయినా కొత్తగా పెల్లి జేసుకున్నోణ్ణి పెల్లాంతో యిట్టాటి య్యాన్నీ— అసలెవురన్నా సెప్పుకుంటారా అంట? అసలు వుత్త ఎదవనుగానూ నేనూ? ఇట్టా వొచ్చుద్దనే ఆ మద్దె తొలేకాసినాడు, కిష్టమ్మకు గుబుల్దిరిగి, ఒసికర్ర దీసుకుని తల పగలాన్నకుతే, కిక్కురుమనకుండా ఎల్లి వాములదొడ్డో పండుకున్నా. పోనీ పని మానుకుందామా అంటే మాటలా? ఆనాడు గురవా యోళ్ళ దేమన్నారూ? "నీకు ఏనాడో సుడివుండని లేరా, కిష్టమ్మగారి పెద్దజీత గాడి వయినావూ!' అన్నారు. ఆళ్ళకేం దెల్సుద్ది ఆసల్సంగతి? అయినా యింకోసోట యాడన్నా కాత్తె సుమారయిన పని దొరకాలగందా? ఏడా? యీ సన్నాసూర్లోనేనా మడుసులు కాత్తె సుమారుగా బతికేదీ? ఎదవ మొగాలుగాదూ యీడంతా! అంతా దివాలా ఎత్తారుగందా. కేసులు బోసుల్తో తలకాయలు పగల్నాకున్నానీ! అందుకే దీన్ని బొంబోడూరంటారు, ఎవరో ఒకరిద్దరు కిష్టమ్మ గారంటి వారయితే అట్ట ట ట ట మద్దెన బాగుపడ్డారు గాని— మిగతాదంతా వుత్త శత్త గాదూ? పొలం అంటే కిష్టమ్మగారి పొలం అనాల ఎప్పటికయినా! రతనాలు కక్కుతయ్యంటే ఇలకా ఆడ సచ్చేంపుంటదీ? ఈ సేతుల్తో యిన్నేళ్ళ మించి ఎట్టాటి కుప్పలూన్నర్చానూ? హిం, కోటయకొండ పెబల్లాంటి కుప్పలు! "ఒలియ ఒలియో" అంటా తొలికోడి కూసినప్పట్నుంచీ కొట్టుకుంటా పోయిన పోటం— జల్లలా జల్లలా రాసుల్లాసులు అంతరిచ్చానికి లెగిసి పోతా వుండా ల్సిందే — కిష్టమ్మగారు అవకాడ నిలబడి ఇదంతా చూస్తా నవుతా వుంటాడు. నాకే

గనక అట్టాటి కుప్పలుంటేనా ! సుబ్బాన్ని సికరఁమీన కూకోబెట్టా ! నవ్వద్ది సుబ్బాం ! ఆ గింజనంతా మీనబోసుకుంటాం తరంబరాలకుమల్లే ! కుప్పగొట్టే ఎంకాయ్, యీరాయ్, పోలాయ్, పెంటాయ్, దిబ్బాయ్, గుంటాయ్, మట్టాయ్, చక్కాయ్, పుల్లాం, పోలాం, ఎఱ్ఱాం, ఎఁకాం యీళ్ళందరికీ బత్తాలకి బత్తాలు–"

"సూరాయ్" అన్నది కిష్టమ్మగొంతు.

"ఏంది కిష్టమ్మగారూ–" దున్నకుఱ్ఱకు గాబుకాడ నీలు పెట్టా సుట్ట మైకంలో కూకునుండ పెద్దజీతగాడు - కండబల్సిన కోడెదూడ కుమ్మిన కుమ్మటం అట్ట ట ట ట ట లెగిసి పోయినట్టు - పల్టీవేసి నిలబడ్డాడు సూరాయ్, కిష్టమ్మనీడ అట్టగుపించే తలికి.

"సుట్ట గీటుమీనుండదేరా సూరాయ్ ?"

"అబ్బె యాడ్దండీ - వుత్త శత్త పుగాకయితే !"

"చా యదవా పొళ్ల రానూ్నకేవోళ్లలేకా ! దున్నకుఱ్ఱకు అంతసేపంట్రా నీలుతాపేదీ !"

"సప్పరిచ్చుకుంటా తాగుద్దండీ–"

"ఇగ ఆడకి సాల్లేవోయ్ ముండా"

"అంతే లెండి."

"ఇదుగో సూరాయ్ ?"

"ఏంది కిష్టమ్మగారూ ?"

"ఈ ఏడు మనపంట ఎట్టా పండిందనుకుంటున్నావ్రా ?"

"ఇరగబడి పండిందంటున్నారండీ ?"

"నిజంగానంట్రా !"

"నిజంగా ! వూరంతా యిదేమాటయితే !"

"బలేపంట పండిందటావ్ ?"

"బలేగిలే ఎరగమే !"

"సూరాయ్ ?"

"ఏంది కిష్టమ్మగారూ ?"

"కొత్తకోడెగిత్తలొస్తున్నయి తెలుసునంట్రా ?"

"యాడ ? - ఎవురికీ–!"

"మనకేరా యెదవా !"

"ఏందీ– నిజంగానంటండీ– చా–! అరె– అః హి-హి-హి సెప్పలేదేం

టండి కిష్టమ్మగారూ ?"

"మొన్న ఏటవతలకు ఎల్లినప్పుడు బేరం జేసొచ్చాలే. యీ పాటికి రెడ్డెమ్మ తోలుకొస్తావుండాలి."

"చా !"

"చా ఏందిరా ముండా. బల్ మనగాడి గిత్తలయితే !"

"ఆఁ-యిహి-."

"ఈఏడు కుప్పల్నూర్పిడఁతా మన కొత్తగిత్తల మీనగా పోవాల్సిందే!"

"దమ్ము ల్లేపనఁడీ !"

"పదిహేనొంద లిచ్చి కొన్నా !"

"కిష్టమ్మగారు తల్చుకుంటే పదే నొందలొక లెక్కేఁంగదంటా !"

"మంచి ఏపుమీనుఁదయిలే !"

"యింకా ఏపుమీన మేపుతా!"

"సూరాయ్ ?"

"ఏంది కిష్టమ్మగారూ ?"

"రేపు తొలికోడి కూసే యాలకు నూర్పిడి మొదలు పెట్టాల - చెప్పానుగా ?"

"మరి అంతేగదఁడీ."

"మాలపల్లిలో అఁదరీ కేకేశావంట్రా ?"

"ఎప్పుడో అయిపోతే."

"గొబ్బిరికాయలు తెచ్చావంట్రా ?"

"అప్పుడే తెత్తిని గదంటండీ."

"రాత్రికి యింకోసారి ఎల్లి వాళ్ళందర్నీ రెడీ గుండమను "

"ఎళ్ళను మరీ !"

"నువు పెందలకాడ లెగవకపోయినావంటే మెడిరగ నూకుతా - తెల్సిందా ?"

"మొదలు నాకు నిదరేద పట్టద్దఁడీ !"

"కోడెగిత్త లొస్తావుంటయి. గాబులో కుడితి గలిపి రెడీగుండు - ఆఁ ?"

"క్లై ! కోడిగిత్తలు తల్మోఁడమొయ !" అనుకున్నాడు సూరాయ్.

"పంటకుప్పలు ! కోటయకొండ పెబలకుమల్లే - ఎంకాయ్, యీరాయ్, పెంటాయ్, పోలాయ్, మట్టాయ్, చక్కాయ్, డిబ్బాయ్, పుల్లాం, పోలాం,

ఎంకాం, ఎర్రాం - లెగిసిపోవాల్సిందే - నూర్పిడి తల్మొండమొయ..."

*　　　*　　　*

నిశిరేత్రే లెగిసి కూకుండాడు తను. నయం! యింకానా తను పండుకునేదీ! పంటకుప్పలు నూర్చుకోనక్కర్లా? తొలికోడి ఎప్పుడుకూసినా కూసుద్ది...

పంట యిరగపడి పండింది! పంటకుప్పల్ని సూత్తుంటే ఒల్లు యాడికో లెగిసిపోతుండది! ముంగలగా ఎల్లి తను ఒక్కో పంటకుప్ప సికరమ్మీన కూకోవాలి - సుబ్బాం అంత దొబ్బున ఎక్కలేదు - ఆఁ, దాన్ని నమ్మిందెవురు - తల్సుకుంటే ఎంత పనయినా సేసుద్ది. పిర్రలెగరేసుకుంటా. బల్ ముద్దొచ్చుద్ది ఎదవముండ! నూర్పిడి అవుతావుంటే సూడాలి ఎదవను - యియ్యాల ఒడ్లగింజనంతా దాన్నె తినే పోశాననుకో - యిద్దరం పోసుకుంటాం.

అరె నాయనా ఎట్టాటి కోడెగిత్తలు! సూరాయ్ కోడెగిత్తలు! గిత్తల మీన కిష్టమ్మ సెయివేశాడంటే ఒసిక్రగతో తల ఏటుకు పగిలిందన్నమాటే! ఇంకా నెమరేత్తా పండుకున్నారేందే లెగవండి లెగవండి ఏలయిపోతుండది - దూరపయానం జేశారుగావాల్న కూసేపు జనపకట్టల్ని తినండి - యియ్యన్నీ తినండి. ఎందుకే అట్టజూత్తారూ? సూరాయంటే వాడు వీడనుకుండారో ఏమో, మీమీన యీగవాలిందంటే యీ సూరాయి పానం ఆపజాన అడ్డంగా పడిపోవల్సిందేననుకోండి - గెనగెన గంటలు, గెజ్జెలు, మువ్వలు, కుచ్చులు, గులాం కొట్టుకుంటా - దుమ్ములెగుపుతా పోవాలి. యాడకి పోయినా - తల్మొండమొయ సూరాయిగిత్తలు - యీ సుబ్బాం యింకా పండుకుందేం యాల మిగిలిపోతుంటే-

"సుబ్బాం?"

"సాల్లే వూర్కో -"

"లెగవ్వే నా సిలకా -"

"అదేందమ్మా కోక గుంజుతాడూ- నా చంగతెరగవు- నిదరొత్తుండది-"

"నిదరా? యిదేం సుబ్బాంరా యిదీ- గెంటలు గెనగెన మోగిపోతవుంటే, లెగులెగూ-"

"అబ్బబ్బబ్బబ్బ యిదేం మొగుడో నాయినా - నాసెవులో మోగియ్యమాక - బుడ్డపుంజుకుమల్లే - అబ్బోవ్ - ఎహ లెగూ నిశిరేత్రి యిదేందంటా - మాయదారి సచ్చినోడా -"

"ఆరహారా! ఒలియ ఒలియో - ఇదిగో సుబ్బామోవ్, ఎర్రకోక, నల్లరెయిక కట్టుకు రావాల్సిందే యియ్యాల - ఓరి ఎంకాయ్, యీరాయ్, పోలాయ్,

పెంటాయ్, మట్టాయ్, చక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్ - వాసి పుల్లాం, పోలాం, ఎర్రాం, ఎంకాం యాడవుండ్రా మీ మడుసులు బంగారంగానూ - లెగవండ్రా, లెగవండ్రా తెల్లారిపోతుందదీ - సుబ్బాం గొబ్బిరికాయలెత్తుకురా - ఎర్రకోక, ఎర్రకోక - పదండి పదండి, లెగవండి లెగవండి - సూరాయ్ కోడెగిత్తలు - ఎల్లిపోతుండయి మేగల్మీన—

"ఎందుకే సుబ్బాం సిగ్గుపడ్తుండావ్ ?"

"బలేబండి - బలేగిత్తలు!"

"సూరాయ్ బండి, సూరాయ్ గిత్తలు—
'ఒరి ఒరి బండీవోడా, ఒగలమారి బడివోడా'— ఓహెయ్—"

"బండిమీనా నాసోకూ నిలపరా బండీవోడా - ఏహేయ్—"

"ఒహో సిత్తరేఖా ?"

"ఏమి అనిరుద్ధణా ?"

"ఎహే అనిరుద్ధుడసే—"

"ఏం సచ్చాడో యదవ - ఒగలమారి బండీవోడా !"

"బండిమీనా నీ సొగసూ - ఓరి రండిరా, రండిరా మూర్తం మిగిలిపోతూండదీ - గొబ్బిరికాయలు కొట్టనేందే సుబ్బాం-"

"క్లై! మడిసంటే సూరాయ్‌కిమల్లే అట్టుండాలి!" అంటుండారు కుప్పగొట్టే ఎంకాయ్, యీరాయోళ్ళు - తనకి దెల్బు ఎంకాయోళ్ళసంగతి - "ఒలియ ఒలియో - ఎత్తరేందిరా కట్టలూ—"

క్లై! రతనాలకిమల్లే రాల్తుండయి గింజలు! సూరాయ్, సుబ్బాం, ఎంకాయ్, యీరాయ్, పోలాయ్, పెంటాయ్, మట్టాయ్, చెక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్, పుల్లాం, పోలాం, ఎర్రాం, ఎంకాం - యాళ్ళందరి సేతుల్లోంచి రాల్తుండాయి గింజల — తళతళ, బగబగ మెరుత్తా రాల్తుండయి — అందరి మొగాలు మెరుత్తుండయి - ఎంకాయోళ్ళ ఒళ్ళు సెమటలు కారిపోతుండయి— ఎర్రాయోళ్ళ కళ్ళు రఖతం గక్కుతుండయి— ఒలియ ఒలియో —

"సుబ్బాం, నీకళ్ళు నీలుగార్తుండయ్యేందే !"

"నీ మొగం ఎర్రగావుండదేరా !"

"దువ్వ లెగిసిపోతుండది - కుప్పలు కరిగిపోతుండయి - తొక్కండి, తొక్కండి కళ్ళాం, ఎయ్యండి, ఎయ్యండి కళ్లాం - సుబ్బాం, తూర్పార, తూర్పారపట్టు, పట్టు— తరంబరాలు—"

“ఓహేయ్ !”

“ఏహేయ్ !”

“ఆదాన్నైనా జిలేబి సెంచయ్య ఒచ్చాండ్రా నాయనా– ఓతాళాసెవుల గుత్తి సెంచయ్యోవ్– జిలేబి, సెక్కిరాలు, పకోడీలు, పొప్పుండలు, ముంత కజ్జాయం– ఓర్నీ రావయ్యా నీ యిల్లు బంగారంగానూ. వారె గోతాం దెచ్చాండ్రా యీ సెంచయ్య కడుపాత్రంపాదుగానూ– ముంగల కాత్తై జిలేబీ పెట్టు. ఆనక సూద్దాం గోతాం సంగతి– ఏందదీ– ఏంది సన్నాయికర్ర యినిపిచ్చుద్దే – గంగిరెద్దోళ్ళు ఒచ్చార్రా నాయనా– పెలిజేత్తారుగావాల్ను–ఎహె పదండాతలికి సెవులో వూత్తారూ– ఎహెఎహె, యిదేంది గంగిరెద్దు వడ్లకుప్పెక్కద్దీ– ఓ గంగిరెద్దాయనోవ్, కాత్తై దాన్ని నిలపవయ్యా సికరమ్మీన కెల్లి కూకుంటదేమో– వుండండి, కాత్తై వుండండి– వూదమాక అంగో ఆడ నిలబడి ఆడండి గంగిరెద్దాట– ఇదుగో సీతారాములోరి పెల్లి– పెల్లి ఆడిబ్బాల తెల్చిందా?”

ఏనాది సెంచాం కూతురు బుడ్డది ఒడిగట్టుకొచ్చి మొగమాటంగా నిలబడ్డది– సుబ్బాం సేటతో శాగెడు గింజలు బుడ్డదనాళ్లో పోసింది–

“సుబ్బాం” అన్నాడు తను ఎరకోక సుబ్బాన్ని వడ్లరాసి సికరంమీనకు లాగుతా.

“ఏందయ్యా!” అంటున్నది సుబ్బాం సిగ్గుతో తలొంచుకుంటా.

ఎర్రగా నల్లగా మెరిసిపోతుండది సుబ్బాం– పెద్దకాలవగట్టున సూరుడు ఎర్రబడిపోతుండాడు రశతానికిమ లే– రతనాలకిమ లే– అదేంది !– ఎంకాయ్– యీరాయ్– పేలాయ్– పెంటాయ్– మటాయ్, చక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్, ఫల్లాం, పోలాం, ఎరాం, ఎంకాం రాసి సుట్టూతాజెరి ఎగుర్తుండారు–ఓహేయ్–

“ఓరి సూరాయోవ్–”

మంచంమీన్నుంచి ఎగ్గిరి కిందపడ్డాడు పెద్దజీతగాడు సూరాయ్... అది కిట్టమ్మ గొంతు

“యిస్యాల కుప్పలు కొట్టక్కర్లేదంట్రా సూరాయ్? యింకా లెగిశావా లేదురా– తన్నుండ్రా నిదరమొగం నాయాల్ని– ఎల్లి ఎంకాయ్, యీరాయోళ్లను కేకేసిరావేం?” దబదబ దబదబ కిష్టమ్మ గొంతూ, సెయ్యా సూరాయ్ గుడిసెమీన, గుండెమీన మోగిపోయినై దద్దరిల్లగొడ్తా...

*